

యర్రమల్లలో ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నాచుగుంట పంచాయతీ పరిధిలోని యర్రమల్లలో రూ.23.94 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని సేవలు అందించేలా ఆర్‌బికెలను ప్రభుత్వం తీర్చిదిద్దిందన్నారు. కార్యక్రమంలో సర్పంచి ఏలేటి సునీత, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి కొరిపల్లి జయలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ మంగారావు, రైతులు, నేతలు పాల్గొన్నారు.



ఆర్‌బికె ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ వాసుబాబు

టి.నర్సాపురానికి రైల్వే కూత..!



మండలం మీదుగా రైల్వేలైన్‌కు ఆ శాఖ గ్రీన్‌సిగ్నల్

మెట్ట ప్రాంతంలో జోరుగా చర్చ

ఇప్పటికే నిర్మాణంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే

టి.నరసాపురం కేంద్రంగా నేవీ లోడింగ్ పాయింట్

అన్ని రకాల అభివృద్ధికి అవకాశం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో భవిష్యత్తులో రైలు కూత విన్పించనుంది. అటు హైదరాబాద్, ఇటు వైజాగ్ తదితర ప్రాంతాలకు రవాణా సౌకర్యం విస్తరించనుంది. మండల ప్రజలు ఎవరూ ఊహించని విధంగా జిల్లాలో కొవ్వూరు నుండి జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, అశ్వారావుపేట మీదుగా భద్రాచలం వెళ్లాల్సిన రైల్వేలైన్ కొవ్వూరు నుండి జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే వెంబడి మండలానికి రాబోతుంది. దక్షిణమధ్య రైల్వే అధికారులు మండలం మీదుగా రైల్వేలైన్ ఏర్పాటుకు పచ్చజెండా ఊపినట్లు సమాచారం. దీనిపై జిల్లాలో, ప్రధానంగా మెట్టప్రాంతంలో ఇప్పటికే పెద్దఎత్తున చర్చ సాగుతోంది. జిల్లాలో మారుమూల ప్రాంతంగా ఉన్న టి.నరసాపురం మండలానికి రైల్వేలైన్ రావడం హర్షణీయమని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండలం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదే క్రమంలో మరో సౌకర్యవంతమైన ప్రయాణ, రవాణా సౌకర్యం రైల్వేలైన్‌తో ఏర్పడుతుందని పలువురు చెబుతున్నారు.

కొవ్వూరు-భద్రాచలం రోడ్ రైల్వే లైన్ నిర్మాణానికి దక్షిణమధ్య రైల్వే పచ్చ జెండా ఊపిందని తెలుస్తోంది. ఏప్రిల్ 1న సత్తుపల్లిలో ఈ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించేందుకు రైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే అప్పటికి ఎన్నికల కోడ్ రానుండటంతో ఈ ప్రచారంపైనా పలు అనుమానాలు నెలకొన్నాయి. అయితే దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఆరుణ్ కుమార్ జైన్ నేతృత్వంలో ఈ లైన్ నిర్మాణ పనులకు సాగుతున్నాయని, 2030 మార్చి నాటికి 151 కిలోమీటర్ల రైల్వేట్రాక్ నిర్మాణమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు చెబుతున్నారు. దీనికిగాను రూ.2154 కోట్లు ఖర్చవుతుందని అంచనా వ్యయం రూపొందించినట్లు సమాచారం. దీనికి రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి అవసరమైన అనుమతులు కూడా వచ్చాయని ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే హైదరాబాద్-రాజమండ్రి మధ్య రాకపోకలు సాగించేవారికి మరింత సులభ రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ మార్గం అందుబాటులోకి వస్తే సుమారు 75 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని అధికారుల అంచనా. రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావుతోపాటు పలువురు ఎంపీలు పలుమార్లు రైల్వే ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం రైల్వే లైన్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందని చెబుతున్నారు.

మండల ప్రజలు హర్షం

మండలం మీదుగా రైల్వే లైన్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపడుతున్నారనే వార్త చర్చనీయాంశమైంది. ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం క్రమంలో రైల్వేలైన్ కూడా ఏర్పాటైతే మండలం నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉంటుందని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

1960లో జీలుగుమిల్లి మండలం మీదుగా లైన్ ఏర్పాటుకు సర్వే

భద్రాచలం రోడ్-కొవ్వూరు రైల్వే లైన్ ఏర్పాటుకు 1960లోనే తొలి సర్వే జరిగింది. అప్పటి అవసరాలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అనేక ప్రతిపాదనలు చేశారు. కొత్తగూడెం (భద్రాచలం రోడ్) స్టేషన్ నుంచి సత్తుపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లోని ఏజెన్సీ గ్రామాలతోపాటు, కొయ్యలగూడెం మండలం రాజవరం, పొంగుటూరు మీదుగా కొవ్వూరు వరకూ ఈ లైన్ నిర్మించాలని నాటి సర్వే సాగింది. తర్వాత పలు దఫాలు సర్వేలు సాగినా అవేమీ కార్యరూపం దాల్చలేదు. అయితే 2004 తరువాత సత్తుపల్లి ప్రాంతంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభం కావడంతో తెలంగాణ ప్రభుత్వం కొత్తగూడెం-సత్తుపల్లి మధ్య బొగ్గు తరలించేందుకు రైల్వేలైన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కాస్ట్ షేరింగ్ పద్ధతిలో సింగరేణి యాజమాన్యం రూ.706 కోట్ల ఖర్చు భరించగా, రైల్వే శాఖ రూ.85 కోట్లు వెచ్చించి ట్రాక్ ఏర్పాటు చేశారు. దీంతో సత్తుపల్లికి రైళ్ల రాకపోకలు మొదలయ్యాయి. ఇక కొవ్వూరు-సత్తుపల్లికి మధ్య రైల్వే లైన్ నిర్మాణానికి డిమాండ్ ఉండటంతో ఖమ్మం- దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే వెంబడి కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దీంతో మండలంలోని బొర్రంపాలెం, టి.నరసాపురం గ్రామాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కన లైన్ ఏర్పాటుకు ప్రణాళికలు చేపట్టినట్లు తెలుస్తోంది.

విద్యార్థులకు అస్వస్థతకు కారకులపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యాన ఆందోళన



వంటలను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గిరిజన విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన అధికారులు, మెస్ కాంట్రాక్టర్‌తో కుమ్మక్కైన ఉన్నతాధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని, గిరిజన హాస్టళ్లలో సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎస్ ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘా ల ఆధ్వర్యాన విద్యార్థులు గిరిజన సంక్షేమ వసతిగృహం ఎదుట బుధవారం బైఠాయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులను పట్టించుకునే నాధుడే లేకుండాపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఘటన జరిగే వరకూ అధికారులు సైతం స్పందించడం లేదన్నారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహించిన యాత్రలో ఏజెన్సీలో గిరిజన విద్యార్థుల సమస్యలన్నింటినీ జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ, ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకెళ్లినా స్పందించిన దాఖలాల్లేవన్నారు. జీలుగుమిల్లి గిరిజన బాలుర వసతి గృహంలో ఆదివారం జరిగిన ఘటనపై దర్యాప్తు జరిపించి కారకులైన హాస్టల్ యాజమాన్యం, కూరగాయలు, సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గిరిజన విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఐటిడిఎను ముట్టడిస్తామని ప్రకటించారు. పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు సొంత నియోజకవర్గంలోని గిరిజన విద్యార్థుల సమస్యలు పట్టించుకోకపోగా కనీసం వారి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేత బి.యశ్వంత్, మణి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, నేత టి.దుర్గారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. దీనికి ముందు వసతిగృహంలో పరిస్థితిని నేతలు పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో విద్యార్థులకు వండిన వంటలను పరిశీలించారు. హాస్టల్ పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉండటం, బాత్‌రూమ్‌లు అధ్వానంగా ఉండటం, గదుల్లో ఫ్యాన్లు సరిగా లేకపోవడంపై ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

జంగారెడ్డిగూడెం టౌన్: జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ వసతి గృహంలో అస్వస్థతకు గురై జంగారెడ్డిగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతన్న విద్యార్థులను ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, మండల కార్యదర్శి ఎ.ప్రభాకర్‌రావు పరామర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల నాణ్యతపై పలుమార్లు విద్యార్థులు, తల్లిదండ్రులకు వార్డెన్‌కు, స్కూల్ హెచ్ఎంకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతోనే ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన సరుకులు అందించని మెస్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వహించిన అధికారులపైనా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పి.చంటి, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అందరినీ కలుపుకుని ముందుకెళ్తా

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సొంగా రోషన్‌కుమార్



మాట్లాడుతున్న సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

తనపై నమ్మకంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించినందుకు అధిష్టానానికి కృతజ్ఞతలని, నియోజకవర్గం లో నేతలను, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారందరినీ కలుపుకుని ముందుకెళ్తానని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఆయన పేరును టిడిపి అధిష్టానం బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను అనేక సంవత్సరాలుగా మిషన్ హోప్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా చింతలపూడి నియోజకవర్గంలోనే కాక ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. ఆపదలో ఉన్నవారికి నేనున్నాను అంటూ భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నానన్నారు. సొంగా రోషన్‌కుమార్ టిడిపి నేతగా నియోజకవర్గంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించారు. కరోనా సమయంలో మిషన్ హోప్ టీమ్ ద్వారా నిత్యావసర సరుకులు, మందులు, ఆక్సిజన్ అందించి ఎంతోమంది ప్రాణాలు నిలబెట్టేందుకు సహకరించారు. కరోనా సమయంలో జీతాల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులు, ఆయాలు, ఆటోవాలాలు, వివిధ తరగతుల ప్రజలకు నిత్యావసర సరుకులు అందించడంతోపాటు ఆర్థికంగానూ చేయూత అందించారు. ఆయన స్వగ్రామం లింగపాలెం మండలం ధర్మాజీగూడెం. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా తన పేరు ప్రకటించగానే రోషన్‌కుమార్ ధర్మాజీగూడెం సెంటర్లోని మహాత్ముల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వివిధ ఆలయాలను సందర్శించారు. జంగారెడ్డిగూడెంలో నేతలు, కార్యకర్తలను కలుసుకుని కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా రోషన్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ అంతా సమిష్టిగా పని చేసి వచ్చే ఎన్నికల్లో చింతలపూడిలో టిడిపిని గెలిపించి చంద్రబాబుకు బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై విద్యార్థులకు ఆసక్తి కల్గించాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. మండలంలోని బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. తొలుత గిరిజన గురుకుల ఉన్నత పాఠశాలలో సిఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం లైబ్రరీలో ఏర్పాటు చేసిన ఫర్నీచర్, పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులు డిజిటల్ లైబ్రరీని వినియోగించుకునేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో క్రీడా మైదానం మెరుగుపర్చడానికి చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ డిడి పివిఎస్.నాయుడును ఆదేశించారు. ఖాళీగా ఉన్న మూడు రూమ్‌లను కలిపి డైనింగ్ హాలుగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. లైబ్రరీ నిర్వహణకు మంజూరు చేసిన నగదును కొత్త పుస్తకాల కొనుగోలుకు వినియోగించాలన్నారు. లైబ్రరీలోని వైట్‌బోర్డుకు నలుపు రంగు వేయించి మంచి స్లోగన్స్‌ను ప్రతిరోజూ డిస్‌ప్లే చేయాలన్నారు. అనంతరం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో వండిన ఆహార పదార్థాలను కలెక్టర్ పరిశీలించారు. పదార్థాలు నాణ్యంగా ఉండాలని, తాగునీరు స్వచ్ఛంగా ఉండేలా ఎప్పటికప్పుడు ప్రిన్సిపల్ పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి ఇక్కడ పిల్లలు ఆటలు ఆడుతున్నరా అని ఆరాతీశారు. గ్రౌండ్ అభివృద్ధికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ కార్యనిర్వాహక ఇంజినీర్ కెవిఎస్ఎన్.కుమార్, డిఇఒ అబ్రహం, డివైఇఒ నీలయ్య, ప్రిన్సిపల్ రజనీబాయ్, ప్రధానోపాధ్యాయిని ఎస్.విజయలక్ష్మి, సర్పంచి ఎం.రామలక్ష్మి, ఎంపిడిఒ ప్రవీణ్, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఇఒ బాబూరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లెనిన్ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి

రెడ్‌బుక్ డే కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి



జంగారెడ్డిగూడెం అధ్యయన వేదికలో మాట్లాడుతున్న రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

సమాజాన్ని మార్చేందుకు ప్రతి ఒక్కరూ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. జంగారెడ్డిగూడెం సిపిఎం కార్యాలయంలో రెడ్ బుక్ డే అధ్యయన వేదిక బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టౌన్ కార్యదర్శి పసల సూర్యారావు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ ఈరోజు ప్రపంచవ్యాప్తంగా రెడ్ బుక్ డే జరుపుకోవాలన్నారు. సాహిత్యం పెంచుకోవాలని, చేసిన అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తే వాళ్ల సమస్యలు పరిష్కారానికి భౌతిక శక్తులుగా మారతారన్నారు. ఆ దిశగా కొనసాగుతున్న ఈ సాహిత్యం ప్రతి సంవత్సరం పరిస్థితులకు అనుగుణంగా పుస్తకాలు రూపొందుతాయని, అధ్యయనం చేయాలని అన్నారు. రష్యా విప్లవ రథసారథి లెనిన్ పుస్తకం మానవాళికి అవసరమని, లెనిన్ మరణించి 100 సంవత్సరాలు అయినప్పటికీ ఆయన కృషి పాత్ర, ప్రయత్నం, అధ్యయనం, ఆచరణ సమాజానికి ఎంతో ఉపయోగకరమన్నారు. తొలి శ్రామికుల విప్లవ నిర్మాత లెనిన్ అని ఆయన కీర్తిని కొనియాడారు. లెనిన్ అడుగుజాడల్లో నడిచేందుకు ఈ రెడ్‌బుక్ డే మానవాళి సమాజానికి ఎంతో అవసరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.రాంబాబు, ఎ.ప్రభాకరరావు, వై.సీత, నారాయణ, వి.గోపి, ఎస్‌కె.మాబు సుభాని, జి.సూర్య కిరణ్, వి.నరసరావు, పి.చంటి, పి.సత్తిబాబు, సునీల్, రాంబాబు పాల్గొన్నారు.

ఏలూరు : ప్రపంచంలో పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా సోషలిస్ట్ సమాజం సాధ్యమేనని రష్యా విప్లవ నేత కామ్రేడ్ లెనిన్ నిరూపించారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఈనెల 21వ తేదీ వరల్డ్ రెడ్ బుక్ డే సందర్భంగా ఏలూరులో హేలాపురి చైతన్య వేదిక ఆధ్వర్యంలో విప్లవ రథసారధి లెనిన్ జీవితంపై స్టడీ సర్కిల్ జరిగింది. దీనికి ఏలూరు నగర అభివృద్ధి కమిటీ నాయకులు కట్ట సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సభలో రవి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా అభ్యుదయకర సాహిత్యం, కమ్యూనిస్టు సిద్ధాంత పుస్తకాలను అధ్యయనం చేయడానికి రెడ్ బుక్ డే అని జరుపుతారని తెలిపారు. భారతదేశంలో అభ్యుదయకర సోషలిస్టు సమాజాన్ని నిర్మించడానికి లౌకికసక్తులు అందరూ కలసి రావాలని దానికోసం అభ్యుదయవాదులు, ప్రజా సంఘాలు, మేధావులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, పి.కిషోర్ మాట్లాడారు. ఈ సమావేశంలో వివిధ ప్రజాసంఘాల కార్యకర్తలు పి.ఆదిశేషు, ఎ.శ్యామల రాణి, వి.సాయిబాబు, బి.జగన్నాధ రావు, పి.హైమావతి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : ప్రపంచ కమ్యూనిస్టులకు, కార్మికవర్గానికి, కష్టజీవులకు విజ్ఞాపనను రూపొందించిన వ్యక్తి లెనిన్ అని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు అన్నారు. లెనిన్ శత వర్ధంతి సభ ఎ.దుర్గారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 1924 జనవరి 21వ తేదీ సాయంత్రం లెనిన్ కన్నుమూశాడన్నారు. శ్రామిక వర్గ విప్లవ నేత, కార్మిక, కర్షక, వర్గ రాజ్య స్థాపనకు జరిగిన విప్లవానికి నాయకత్వం వహించి, నడిపించిన నేత మరణించి జనవరి 21కి నూరు సంవత్సరాలైంది. అయినప్పటికీ ఆయనను ఇప్పటికీ స్మరించుకోవడం, ఆయన బోధనలు అనుసరణీయంగా ప్రపంచవ్యాప్తంగా చర్చించుకుంటున్నారని, నేటి ప్రపంచానికి లెనినిజం తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కె.సీతారాముడు, వంకా దుర్గారావు, డి.సురేష్, కడప నాని, ఎస్.శివకుమార్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

కలిదిండి : దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న రెడ్ బుక్ డేని పురస్కరించుకొని మండలంలోని భాస్కరరావు పేటలో విప్లవ సారథి లెనిన్ జీవితం, మానవాళీ పీడనకై ఆయన చేసిన కృషిపై అధ్యయనం నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, కార్యకర్తలు వీరవల్లి భాస్కరరావు, వరలక్ష్మి, చీకటి సత్యన్నారాయణ, కుడిపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థుల జ్ఞాన సంపదకు గ్రంథాలయాలు దోహదం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

స్వీయ అధ్యయనం ద్వారా విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించడానికి గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడతాయని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. బుధవారం జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన డిజిటల్ గ్రంథాలయాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు స్వీయ అధ్యయనం ద్వారా వారి విజ్ఞానాన్ని పెంపొందించడానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. లైబ్రరీలో నిశబ్దంతో కూడిన వాతావరణం కలిగియుండటం వల్ల విద్యార్థులు పుస్తకం పఠనానికి శ్రద్ధవహిస్తారని, తద్వారా వారు మంచి విజ్ఞాన శక్తిని పొందుతారని అన్నారు. ప్రస్తుత సమాజంలో మొబైల్ ఫోన్లకు, టీవీలపై ఆధారపడి విద్యార్థులు వున్నారని, వీటినుంచి వారిని గ్రంథాలయ పఠనానికి మార్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆరు ప్రాంతాల్లో డిజిటల్ లైబ్రరీలను సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అందులో ఏలూరులో కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.40 లక్షలతో, మిగిలిన 5 చోట్ల ఒకొక్కటి రూ.10 లక్షలతో డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఏలూరులో రెండు స్కూల్స్‌లో ప్రారంభమయ్యాన్నారు. వీటిలో నాణ్యతగల ఫర్నీచరు, ప్రాధాన్యతా పుస్తకాలు, మంచి వాతావరణం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిని విద్యార్థులు ఉపయోగించుకొని చదువుతో పాటు జనరల్ నాలెడ్జిని, విజ్ఞానం గ్రంథాలయాల ద్వారా పొందాలని కోరారు.

ఇటీవల జీలుగుమిల్లి బాలుర వసతి గృహంలో కలుషిత ఆహార ఘటనపై మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణిని ఈ సంఘటనపై పూర్వాపరాలు పరిశీలించడానికి పంపడం జరిగిందన్నారు. కలుషిత ఆహారానికి సంబంధించిన శాంపిల్స్‌ను పైకి పంపడం జరిగిందని, శాంపిల్స్ పరీక్షల నివేదిక ఆధారంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి వసతి గృహాల్లో రాత్రి సమయంలో తప్పనిసరిగా వార్డెన్ బస చేయాల్సి వుందని, లేనిపక్షంలో ఫిర్యాదు చేస్తే వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.నాగలక్ష్మి, జెడ్‌పిటిసి పి.బాబ్జి, డిఇఒ ఎస్.అబ్రహాం, ప్రధానోపాధ్యాయులు కెఎస్‌వి.లోవకుమారి, ఐటిడిఎ డిడి నాయుడు, మండల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'తెలుగు భాష గొప్పతనాన్ని చాటిచెప్పాలి'



తెలుగు తల్లికి పూలమాల వేస్తున్న వైఎంహెచ్ఎ నేతలు

ఏలూరు అర్బన్: ప్రపంచ భాషలందు తెలుగు భాష లెస్స అని పలికిన శ్రీకృష్ణదేవరాయల స్ఫూర్తిని, తెలుగు భాష గొప్పతనాన్ని ఇప్పటి తరాలవారికి తెలియజేయాల్సిన అవసరం మనపైన ఉందని తెలుగుతల్లి విగ్రహ సంస్థ మేనేజ్మెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కెవి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఎ) ఆధ్వర్యంలో హాలు ప్రాంగణంలోని తెలుగుతల్లి విగ్రహానికి సంస్థ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెవి.సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు అంబికా రాజా, కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు పూలమాలలతో అలంకరించి, మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాలాపన చేశారు. అనంతరం యర్రా సోమలింగేశ్వరరావు మాట్లాడుతూ భాషా, సాంస్కృతిక కళలను ముందుతరానికి తీసుకెళ్లడానికి వైఎమ్‌హెచ్ఎ సంస్థ ముందుంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థులను ప్రశ్నిస్తున్న డిఇఒ

జీలుగుమిల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఉపాధ్యాయులకు ఆదేశించారు. బుధవారం జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారి సిలబస్‌లో నుంచి కొన్ని ప్రశ్నలు అడగగా సమాధానం చెప్పకపోవడంతో ఉపాధ్యాయుల తీరుపై మండిపడ్డారు. అనంతరం పాఠాలు బోధించే క్రమంలో ప్రొజెక్టర్‌కి నెట్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నెట్ సౌకర్యం లేకుండా పాఠాలు ఎలా చెప్తున్నారని ఉపాధ్యాయులను ప్రశ్నించగా సెల్‌ఫోన్ నెట్ వాడుతున్నట్లు తెలిపారు. సెల్ ఫోన్ నెట్‌తో కొన్ని లెస్సన్స్ ఓపెన్ అవకపోవడంతో వెంటనే నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని హెచ్ఎమ్ చంద్రావతిని ఆదేశించారు. అనంతరం హాజరు శాతం పరిశీలించగా 360 మందికి గాను 70 మంది వరకు గైర్హాజరైనట్లు తెలిపారు. ఇంతమంది పాఠశాలకు ఎగ్గొట్టడంపై సీరియస్ అయ్యారు. తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి హాజరు శాతం పెంచేలా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని, అదేవిధంగా పదో తరగతి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలని, త్వరలో జరగబోయే పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఇఒలు కె.శ్రీనివాస్, బుచ్చయ్య, హెచ్ఎమ్ పి.చంద్రావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు డబల్ లైన్‌కు ప్రతిపాదనలు

కామవరపుకోట: కామవరపుకోట నుంచి చింతలపూడి వెళ్లే రోడ్డు డబల్ లైన్ చేయుట గురించి ప్రతిపాదనలు సిద్ధమైయ్యాయని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలిపారు. దేవులపల్లి నుంచి దూబచర్ల వరకు రోడ్డు మంజూరై టెండర్ దశలో ఉందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని ఎంపీ అన్నారు. కామవరపుకోట గ్రామ పంచాయతీ పరిధిలోని పాతూరు నుంచి జీలకర్రగూడెం వరకు వయా జలపవారిగూడెం మీదుగా రోడ్డు వేయుటకు శంకుస్థాపన చేశారు. ముందుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి తదనంతరం ముదిరాజుల కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి : కలెక్టర్

కామవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నట్లు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. బుధవారం జంగారెడ్డిగూడెం, కామవరపుకోట మోడల్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సాంఘీక సంక్షేమ శాఖ, కాలేజియేట్ ఎడ్యుకేషన్‌తో నిర్మించిన ప్రభుత్వ సాంఘీక సంక్షేమ కళాశాల బాలికల నూతన వసతి గృహాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధితోపాటు విద్యాభివృద్ధికి ఎంతగానో కృషిచేసిందని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు వారి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఉచిత విద్యాబోధనలు పొందవచ్చన్నారు. పాఠశాలకు ప్రహరీగోడ ఏర్పాటు చేయడానికి ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరుచేస్తారని, తద్వారా ప్రహరీ గోడను నిర్మించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం హాస్టల్ గదులను, ఫర్నిచర్‌ను పరిశీలించారు. అలాగే విద్యార్థులతో ముఖా ముఖీగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జెడి భానుప్రకాష్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయబాబు, వార్డెన్ అంజనా పాల్గొన్నారు.


సీసీ డ్రైన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి వెంకటేశ్వరమ్మ

శరవేగంగా సీసీ డ్రెయిన్ నిర్మాణం

ప్రజాశక్తి - ముదినేపల్లి

పల్లెల్లోని మట్టి రోడ్ల రూపురేఖలు మారాయి. జిల్లా పరిషత్ నిధులతో పల్లెల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని పెదపాలపర్రు గ్రామంలో సీసీ డ్రైన్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఎస్సి ఏరియాలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో సీసీ డ్రైన్ నిర్మాణం చేపట్టారు. జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ రూ.5 లక్షల జెడ్‌పి నిధులు డ్రైన్ నిర్మాణానికి కేటాయించారు. 170 మీటర్ల పొడవునా సీసీ డ్రైన్ నిర్మాణం జరుగుతోంది. మరో రెండు రోజుల్లో పనులు పూర్తికానున్నాయి. ఎంపిటిసి దూలం నాగేశ్వరరావు ఈ డ్రైన్ నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపారు. దీంతో పనులు చకచకా జరుగుతున్నాయి. గత 50 ఏళ్లుగా ఈ ప్రాంతంలో మురుగునీరు బయటకు పోయేందుకు డ్రైన్ నిర్మించలేదు. దీంతో వర్షపునీరు, మురుగునీరు ఇళ్ల ముందే రోజులు తరబడి నిల్వ ఉంటుంది. ఈ కారణంగా నివాసితులు దుర్వాసనతో ఇబ్బందులు పడటంతో పాటు మురుగు కారణంగా దోమలు వ్యాప్తిచెంది జనం పై దాడి చేయడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఎట్టకేలకు జెడ్‌పిటిసి వెంకటేశ్వరమ్మ తన నిధులు కేటాయించడంతో పాటు, ఎంఎల్‌ఎ డిఎన్ఆర్ సహకారంతో డ్రైన్ నిర్మాణం పూర్తి కానుంది. ఇప్పటికే తమ ప్రాంతంలో డ్రైన్ నిర్మాణం కావడంతో ఎస్సి ప్రాంత ప్రజలు తమ మురుగు సమస్య తీరుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య పరిశీలించారు.

23న దరఖాస్తుల పరిశీలన

జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

ఏలూరు: టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్-3 పోస్టుకు దరఖాస్తు చేసిన 137 మంది అభ్యర్థులందరూ ఈనెల 23న ఒరిజనల్ ధ్రువపత్రాలతో కలెక్టరేట్‌లోని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయానికి రావాలని జిల్లా ఎంపిక కమిటీ ఛైర్మన్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయంలో ఒక ఏడాది పాటు తాత్కాలిక ఒప్పంద ప్రాతిపదికన పనిచేయు నిమిత్తం ఐదు టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్-3 పోస్టుల భర్తీకి జిల్లా అధికారిక ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఈనెల 13 నుంచి 20వ తేదీ వరకు జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్, ఏలూరు వారు నోటిఫికేషన్ జారీ చేసి, మాన్యువల్‌గా దరఖాస్తులు స్వీకరించారు. కావున ఈనెల 23న ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 3 గంటల వరకు వారి ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలనకు తప్పకుండా హాజరు కావాలని జెసి లావణ్యవేణి తెలియజేశారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

టి.నరసాపురం : మండలంలోని మక్కినవారిగూడెంలో ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణానికి జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి సూర్యనారాయణరాజు(సూరిబాబు) బుధవారం ఎంపిపి దారబోయిన లక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ మండలంలోని మక్కినవారిగూడెం నుంచి మర్రిగూడెం వరకు ఆర్ అండ్ బి రోడ్డు సుమారు 2.6 కిలోమీటర్ల మేర రూ.కోటి 7 లక్షల ప్రభుత్వ నిధులతో తారు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత కొంత కాలంగా అధ్వాన్నంగా ఉన్న రోడ్లన్నీ అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. ఆ క్రమంలోనే పుల్లేపు రోడ్డు పనులు ప్రారంభించామని, దీంతోపాటు మర్రిగూడెం రోడ్డు కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ఎస్టీ సెల్ కన్వీనర్ కురసం నిరీక్షణరావు, సర్పంచి సోయం బిందు, దారబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

పోలవరం డిఎస్‌పి సురేష్‌కుమార్‌రెడ్డి

జీలుగుమిల్లి: శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయనున్నట్లు పోలవరం డిఎస్‌పి ఎస్.సురేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం బుధవారం జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు వాటిని ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని, సిబ్బంది హాజరును పరిశీలించారు. అనంతరం ఇటీవల కాలంలో నమోదు చేసిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరిహద్దు గుండా బారికేడ్లను పెంచి వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయనతో పాటు ఎస్ఐ చంద్రశేఖర్, ఎఎస్ఐ సిబ్బంది, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రీయ విధానంలో బెల్లం తయారీ

నూజివీడు రూరల్: మండలంలోని పల్లెర్లమూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ డివిజన్ యూనిట్ ఇన్‌ఛార్జి సర్వతల పర్యవేక్షణలో బుధవారం సేంద్రీయ బెల్లం తయారీ చేపట్టారు. ఈ సందర్భంగా సర్వతల మాట్లాడుతూ రైతులకు సేంద్రీయ వ్యవసాయ విధానంపై పొలంబడి నిర్వహించి సేంద్రీయ విధానంపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం భాగంగా రైతులు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, అప్పారావు మరికొందరు రైతులు సేంద్రీయ విధానంలో బెల్లం తయారీ చేపట్టినట్లు తెలియజేశారు. ఇది ఎంతో మేలు చేస్తుందని ఆమె వివరించారు.

'ఓటమి భయంతోనే మీడియాపై దాడి'

కొయ్యలగూడెం: ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మీడియాపై దాడులకు తెగబడుతున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గంగిరెడ్డి మేఘలాదేవి ఆరోపించారు. బుధవారం ఆమె స్వగ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేఘలాదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రంలో హింస పరాకాష్టకు చేరిందన్నారు. జగన్ ప్రభుత్వం మీడియాను ఉక్కుపాదంతో తొక్కే ప్రయత్నంలో భాగంగానే మీడియా ప్రతినిధులపై భౌతిక దాడులకు తెగబడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాప్తాడు సంఘటన మరువక ముందే వైసిపి గూండాలు కర్నూలు ఈనాడు కార్యాలయంపై జరిపిన దాడి చేయడం రాష్ట్రంలో అధికార పార్టీ నేతల అరాచకత్వానికి, దిగజారిన శాంతిభద్రతలకు నిదర్శనం అన్నారు. మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసులను స్వీకరించి, చట్టప్రకారం నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేరాలు - ఘోరాలు

బీరు సీసాతో భార్య, అత్తపై దాడి

నూజివీడు రూరల్: మండలంలోని పోలసానిపల్లి గ్రామానికి చెందిన చల్లా గంగారావు(42) చెడు వ్యసనాలకు బానిసై బుధవారం తన భార్య శివ(38)ను బీరు సీసాతో దాడి చేసి చంపబోయాడు. ఆమె తప్పు కోవడంతో భుజంపై గాయాలయ్యాయి. అంతకుముందు కర్ర కత్తితో నరకడానికి ప్రయత్నించడంతో సమీపంలోని ప్రజలు రావడంతో కాపాడారు. అనంతరం తిరిగి దాడి చేయడంతో శివ తల్లి దుర్గ(58) అడ్డుపడింది. ఆ సమయంలో ఆమెకు కూడా గాయాలయ్యాయి. ఇద్దరూ చికిత్స నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంగారావుపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జీలుగుమిల్లి: మండలంలోని తాటియాకులగూడెం సరిహద్దు తనిఖీ కేంద్రం గుండా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బుధవారం తెల్లవారు జామున సరిహద్దు వద్ద పోలీసులు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తుండగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ నుంచి తెలంగాణలోని విఎమ్ బంజరా మీదుగా సరిహద్దు గుండా వస్తున్న లారీని ఆపి తనిఖీ చేశారు. అందులో 215 క్వింటాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.8 లక్షల 87 వేల నిర్ధారించినట్లు అన్నారు. లారీను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం లారీను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, విఆర్‌ఒ బుల్లిబుల్లు, విఆర్ఎ షరీఫ్ పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య సేవలను నగర ప్రజలు ఉపయోగించుకోవాలని కొత్తపేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శశాంక్, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ సూపరిండెంట్ సిరద్దున్ సూచించారు. స్థానిక ఏలూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొత్త పేటలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిరద్దున్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు ఉచితంగా పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా రక్త పరీక్షలు, ఇసిజి, ఉచిత కంటి పరీక్షలు, ఉచితంగానే మందులు, అవసరమైన వారికి ఉచితంగానే శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, హెల్త్ సూపర్వైజర్ మార్తమ్మ, సచివాలయం హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, విగ్నేష్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో పాటు అదనంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి తెలిపారు. జంగారెడ్డిగూడెంలోని 8వ సచివాలయం పరిధి అశ్వరావుపేట రోడ్డు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య ఆధ్వర్యాన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు పిపిఎస్.చంద్ర రావు, కౌన్సిలర్ కంచర్ల గీత, నెకూరి కిషోర్, తడికిమల్ల మురళీ పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

భీమడోలు: మండలంలో ఖాళీగా ఉన్న ఏడు గ్రామ వాలంటీర్ల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంపిడిఒ స్వర్ణలత తెలిపారు. దీనిలో భాగంగా ఆగడాల లంక, అంబరుపేట, పొలసానిపల్లి, సూరప్పగూడెం, భీమడోలు నెంబర్-2, గుండుగొలను నెంబర్-3, చెట్టున్నపాడు సచివాలయాల్లో ఒక్కొక్కటి వంతున పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. ఆసక్తిగల దరఖాస్తుదారులు ఈనెల 25వ తేదీలోగా యుఆర్ఎల్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 27వ తేదీన దరఖాస్తుదారులకు ముఖాముఖి నిర్వహించి అభ్యర్థులను ఖరారు చేస్తామన్నారు. దరఖాస్తుదారులు తమ ఫోన్ నెంబర్లను సచివాలయ డిజిటల్ సహాయకులకు ముందుగా అందజేయాలని తెలిపారు. పోస్టుల భర్తీలో రిజర్వేషన్, ఇతర నిబంధనలను వర్తిస్తాయని చెప్పారు.

ఎరువుల కొనుగోలుకు ఆధార్ తప్పనిసరి

చింతలపూడి: ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు రైతులు వారి ఆధార్ నెంబరు షాపు యజమానికి తెలియజేసి, రైతుల వేలిముద్రను ఈ పాస్‌లో నమోదు చేసుకుని ఎరువులు పొందాలని చింతలపూడి ఇన్‌ఛార్జి వ్యవసాయ సహాయకులు, సంచాలకులు పిజి.బుజ్జిబాబు అన్నారు. మండలంలో బుధవారం రాఘవపురం గ్రామంలో ఎరువుల షాపులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎరువులు అన్నింటిని రాయితీకి ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులందరూ ఈ పద్ధతి సహకరించి, ఎరువులను కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మండల వ్యవసాయ అధికారి మీనా కుమారి పాల్గొన్నారు.

త్వరలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం : ఎంఎల్‌ఎ

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా నూజివీడులో ఆయన బుధవారం మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయంతో పాటు త్వరలో నూతన ఆసుపత్రి భవనాన్ని కూడా ప్రారంభించనున్నట్లు తెలియజేశారు.

తమ్మిలేరు శాశ్వత వంతెన నిర్మాణానికి ఆమోదం

ముసునూరు: తమ్మిలేరుపై శాశ్వత వంతెన నిర్మాణం చేపడుతున్నట్లు బలివే సర్పంచి లావు ప్రవీణ సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బలివే గ్రామంలోని తమ్మిలేరుపై ఎట్టకేలకు శాశ్వత వంతెన నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.18 కోట్లతో ఆమోదం పొందడంతో, బుధవారం నుంచి శరవేగంగా వంతెన నిర్మాణం పనులు చేపట్టారు. వచ్చే నాలుగు, ఐదు నెలల్లోనే రెండు లైన్ల శాశ్వత వంతెన నిర్మాణం, అలాగే ఆ వంతెన నిర్మాణం కింద అండర్ గ్రౌండ్ రహదారి కూడా నిర్మించి వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలియజేశారు. గతంలో ఈ తమ్మిలేరు శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజాశక్తి కథనానికి స్పందించినట్లు అధికారులు ఈ సందర్భంగా తెలియజేశారు.

పలుచోట్ల 'వాలంటీర్లకు వందనం'

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలో బుధవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ తనకు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. వైసిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సిఎం జగన్‌ను మరొకసారి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. బుధవారం సాయంత్రం వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉత్తమ గ్రామ సచివాలయ వాలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి పి.వీరబాబు, ఎంపిడిఒ పి.శామ్యూల్ పాల్గొన్నారు.

శుభ్ కరణ్ సింగ్ మృతి పట్ల ఆందోళన

ఏలూరు : రైతులు పండించే పంటలకు మద్దతు ధరల చట్టం తీసుకురావాలని కోరుతూ ఢిల్లీలో శాంతియుతంగా రైతాంగం నిర్వహిస్తున్న ప్రదర్శనపై కానూరి సరిహద్దులో హర్యానా పోలీసులు సాగించిన దుర్మార్గమైన దాడిలో శుభ్ కరణ్ సింగ్(24) అనే యువ రైతు, ఉద్యమకారుడు తీవ్రమైన గాయాలపాలై మృతి చెందడం పట్ల ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. రైతు ఉద్యమం పట్ల బిజెపి, మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గమైన వైఖరికి ఇది నిదర్శనమని, యువ రైతు మృతికి కారణమైన పోలీసులపై చర్య తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహా, కె.శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు.

సమస్యల వలయంలో 'చింతలపూడి'

జనసేన నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో గత ఐదు సంవత్సరాలుగా ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చింతలపూడి జనసేన నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య అన్నారు. చింతలపూడి పట్టణంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సమస్యలపై సామూహిక నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ దీక్షకు టిడిపి మాజీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి రాకముందు హామీలు ఇచ్చిన నామవరం-సీతానగరం రోడ్డు నేటికీ వేయలేదని అన్నారు. చింతలపూడి నుంచి భట్టువారి గూడెం, బాలవారిగూడెం ఇప్పటికీ పూర్తి చేయలేదని, చింతలపూడి నాగిరెడ్డిగూడెం వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని తెలిపారు. అదేవిధంగా చింతలపూడి నగర పంచాయతీలో సెంట్రల్ లైటింగ్ గాలికి వదిలేశారని, అధ్వానంగా ఉందని అన్నారు. చింతలపూడి పంచాయతీ నగర పంచాయతీ అయిందని ప్రజలు సంతోషించారని, కానీ అభివృద్ధికి మాత్రం నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చింతలపూడి నగర పంచాయతీలో డ్రెయినేజీలు, రోడ్లు అభివృద్ధి చేయాలని అన్నారు. అనంతరం జనసేన మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు మాట్లాడుతూ చింతలపూడి నగర పంచాయతీ నేటికీ అభివృద్ధిలో శూన్యం అని తెలిపారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, కనీసం సెంట్రింగ్ లైటింగ్ కూడా లేదని వాపోయారు. రాబోయే రోజుల్లో సమస్యలపై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై పోరాటానికి నిరంతరం కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు తూము విజయకుమార్, జనసేన కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీలు అమలు చేసి, న్యాయం చేయకపోతే మరో దశ ఉద్యమం చేపడతామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం చింతలపూడి మండలం రాఘవపురం శివారు అంకులయ్య కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు చీకటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు ఆర్బిట్రేషన్ ద్వారా పరిహారం పెంచి న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీ రైతులందరికీ అమలు చేయలేదన్నారు. మండలంలోని రాఘవాపురం, ఎండపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో కొద్దిమందికి మాత్రమే ఆర్బిట్రేషన్ ద్వారా పరిహారం పెంచి ఇచ్చారని, మిగిలిన గ్రామాల రైతులకు ఆర్బిట్రేషన్ జడ్జిమెంట్ ఇవ్వలేదన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ సేకరణలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం పెంపుతో పాటు సర్వీస్ రోడ్లు, బోర్లు కోల్పోయిన వారికి బోర్లు, విద్యుత్ లైన్లు, ఆయిల్ పామ్, కొబ్బరి, తదితర ఉద్యాన తోటలకు పరిహారం పెంపు, తదితర హామీలు అమలు చేయలేదన్నారు. ఎండపల్లి గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం ఎర్ర చెరువులో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా మట్టిని తవ్వేశారని, పెద్ద పెద్ద గోతులుగా తయారు చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతులు వెళ్లే పుంత రోడ్లను సైతం నాశనం చేశారన్నారు. చెరువును వెంటనే చదును చేసే విధంగా, పుంత రోడ్లు బాగు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం మరో దశ ఉద్యమానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మరికంటి రామకృష్ణ, అడ్డూరి గణపతి, నందిగం వెంకట సుబ్బారావు, కంపసాటి వెంకటేశ్వరరావు, కె.అంజయ్య, టి.సత్యనారాయణ, మోరంపూడి వెంకటేశ్వరరావు, చీకటి అప్పారావు, చీకటి నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఫిజియోథెరపీ సేవలపై అవగాహన అవసరం'

భీమడోలు: భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ అవసరమైన పిల్లలకు ఫిజియోథెరపిస్ట్ అందిస్తున్న సేవల పట్ల వారి తల్లిదండ్రులు అవగాహన కల్పించుకోవాలని భీమడోలు మండల విద్యాధికారి అయినపర్తి వెంకట సత్యనాగ భాస్కర్ కుమార్ సూచించారు. భవిత కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్ట్ జి.వింధ్య అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఫిజియోథెరపీ సేవలు పిల్లలకు ప్రతినిత్యం అందించే క్రమంలో పిల్లల తల్లిదండ్రులు సేవలు వినియోగం పట్ల కొంత మేరకు అవగాహన కల్పించుకోవాలని కోరారు. భవిత కేంద్రంలో పిల్లలకు వారంలో ఒకరోజు మాత్రమే ఫిజియోథెరపిస్టు సేవలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో తక్కిన రోజుల్లో పిల్లల తల్లిదండ్రులు వారితో అవసరమైన ఎక్సర్‌సైజులు ఇంటి వద్ద చేయించడం ద్వారా త్వరితగతిన వారిని ఆరోగ్యవంతులుగా చేయవచ్చని సూచించారు. ఆ తరువాత భీమడోలుకు చెందిన నెల్లూరు లక్ష్మీనారాయణ దంపతులు తమ కుటుంబ సభ్యులు సుహాన్ ప్రథమ జన్మదిన పురస్కరించుకొని జన్మదిన కార్యక్రమాలను భవితా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు పుస్తకాలు, తినుబండరాలు, బాక్సులు, ఇతరాలను మండల విద్యాధికారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ పిల్లలతో గడపటం, వారికి చిరుకానుకలు అందజేయడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచవచ్చునని తెలియజేశారు.

ఉపాధి పనులు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ


మాట్లాడుతున్న పిల్లి రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు టౌన్‌లో విలీనం చేసిన ఏడు గ్రామపంచాయతీలలో ఉన్న గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. వ్య.కా.స ఆధ్వర్యాన బుధవారం పోనంగి గ్రామంలో జి.దుర్గ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ రాజకీయ సౌలభ్యం కోసం ఏలూరు టౌన్‌లో ఏడు గ్రామ పంచాయతీలను విలీనం చేయడం వల్ల ఆ గ్రామాల్లో ఉన్న పేదలకు ఉపాధి దొరక్క వలసలు పోతున్నారని ఆందోళన చెందారు. వలసల నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ఈ గ్రామాల్లో నిర్వహించకపోవడం వల్ల వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు ఏళ్ల నుంచి పోనంగి గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహించకపోవడంతో ఎక్కువ కుటుంబాలు వలసలు పోయి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. కొంతమంది ఒంటరి మహిళలు ఆర్థిక ఇబ్బందులతో అప్పుల పా లవుతున్నారన్నారు. వలస నివారణ కోసం తీసుకొచ్చిన చట్టాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. ఏలూరు చుట్టుపక్కల గ్రామపంచాయతీలు పోనంగి, కొమడవోలు, చోదిమెళ్ళ, శనివారపుపేట, వెంకటాపురం గ్రామాల్లో పేదలు నానా అవస్థలు పడుతున్నారని, పనులు చూపించాలని తెలియజేశారు. లేనిపక్షంలో ఆందోళన, పోరాటాలకు సన్నద్ధమవుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ కుమారి, దేవమాత, పాప వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'మాతృభాషను మర్చిపోకూడదు'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యార్థులు ఉపాధి కోసం ఎన్ని భాషలైన నేర్చుకోవచ్చని, కానీ మాతృభాషను మర్చిపోకూడదని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.రామరాజు తెలిపారు. స్థానిక సర్ సిఆర్ రెడ్డి కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నూతన విద్యావిధానంలో మాతృభాష భోదన అనే అంశంపై అతిథి ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.రామరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రులను మమ్మీ, డాడీ అని కాకుండా అమ్మ, నాన్న అని పిలవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి రాజనీతిశాస్త్ర విభాగాధిపతి ఎన్.శ్రీనివాసరావు, తెలుగు అధ్యాపకులు బి.శంకర్, ఎస్.రవికుమార్, సిహెచ్.జాన్సన్ కెనడీ, విద్యార్థులు హాజరైయ్యారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యా బోధనకు, అభ్యసనానికి మాతృభాషకు మించిన సాధనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : తెలుగువారి మాతృభాష అయిన తెలుగులో విద్యాబోధన చేయడం ద్వారానే విద్యార్థుల్లో పరిపూర్ణ వికాసం పెరుగుతుందని విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ అన్నారు. ఆమేరకు బుధవారం విజన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు పాఠశాల కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం హైస్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పి.సురేష్ మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనన్ని విద్యార్థులకు వివరించారు. మన తెలుగు భాష అమృత భాష అని, దేశభాషలందు తెలుగు లెస్స అని అన్నారు. వేమన శతకం నుంచి వంద పద్యాలు కంఠస్తం చేసి చెప్పిన 9వ తరగతి విద్యార్థి అనిల్‌ను ప్రత్యేకంగా అభినందించి పెద్దబాల శిక్ష పుస్తకాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు పండిట్ మద్దాల పెద్దిరాజు, ఇతర ఉపాధ్యాయులు రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇతర గ్రామాలకు ఆదర్శంగా 'అంబరుపేట' : ఎంఎల్‌ఎ

భీమడోలు : మండలంలోని అంబరుపేట గ్రామ పంచాయతీ భిన్నత్వంలో ఏకత్వానికి, మతసామరస్య అమలులో ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచిందని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగు ఆవాస ప్రాంతాల్లో విభిన్న జాతుల వారు నివసిస్తున్నప్పటికీ, కులమతాలకు అతీతంగా అన్ని పండుగలను అందరు స్నేహభావంతో, ఐక్యంగా చేసుకోవటం అభినందనీయమన్నారు. కొత్త అంబరుపేట ఆవాస ప్రాంతంలోని ఉమా రామలింగేశ్వర స్వామి పున్ణప్రతిష్ట కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన రూ.50 లక్షల నిధులతో చేపట్టారు. వేంగి రాజుల కాలం నాటి దేవాలయంగా ప్రచారంలో ఉన్న దేవాలయాన్ని అందుబాటులో ఉన్న రికార్డుల మేరకు 150 సంవత్సరాలు పునర్ నిర్మించారు. ఆ తర్వాత కాలంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ రూ.50 లక్షలతో ఆలయంలోని స్వయంభూ విగ్రహాలు మినహా ఇతర నిర్మాణాలను పునర్ నిర్మించారు. ఈ సందర్భంగా ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా త్రయాహ్నిక దీక్షను దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు దంపతులు నిర్వహించారు. అదే గ్రామంలో 34 సంవత్సరాల పాటు ఉపాధ్యాయులుగా పనిచేసిన తన తల్లిదండ్రులు మేడేపల్లి ఫ్రాన్సిస్, సౌభాగ్య జ్ఞాపకార్థం దీక్షా కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగానే దేవాదాయ ధర్మాదాయ శాఖ తరపున అంబరుపేట గ్రామాలకు చెందిన మహిళలకు ప్రసాదంగా చీరలు పంపిణీ చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసు బాబు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలవరం : మండలంలో ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పోలవరం ఎంపిడిఒ జి.శ్రీను, ఎస్ఐ పవన్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాదరావు బుధవారం పరిశీలించారు. ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంలో భాగంగా పోలింగ్ కేంద్రాలలో కనీస ప్రాథమిక సౌకర్యాలు, పరిసరాలను పరిశీలించారు. సాధారణ ఎన్నికల నిర్వహణకు ఉన్నతాధికారుల ఆదేశాలతో సమస్యాత్మకమైన ప్రాంతాలలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

భీమడోలు : ట్రాన్స్‌కో సబ్ డివిజన్ స్థాయిలో ఈనెల 23వ తేదీన భీమడోలులో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎపిఇపిడిసిఎల్, ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్‌పిబి నటరాజన్ తెలిపారు. ఈ కార్యక్రమం కన్జ్యూమర్స్ గ్రీవెన్సెస్ ఫోరం ఛైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ(విశ్రాంత న్యాయమూర్తి) అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఫోరం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారాన్ని పొందవచ్చునని తెలిపారు. ఇదేవిధంగా మెరుగైన విద్యుత్ సరఫరా, నిర్వహణ నిమిత్తం తగు సూచనలను అందజేయవచ్చునని తెలియజేశారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

కలిదిండి : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని తాడినాడ పంచాయతీ పరిధి సున్నంపూడిలో రూ.20 లక్షల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మాణం పూర్తైన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలిసి దుంపలకోడుదిబ్బలో రూ.1.21 కోట్ల జలజీవన్ మిషన్, గడపగడపకు మన ప్రభుత్వం, డిఎంఎఫ్ నిధులతో నిర్మాణం పూర్తైన మంచినీటి రక్షిత పథకంను ప్రారంభించారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ కొల్లాటి సత్యన్నారాయణ, సర్పంచి గొర్ల వరలక్ష్మి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యోగా శిక్షణా తరగతులు ప్రారంభం

ఏలూరు అర్బన్: హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఎ హాల్‌లో నాలుగు రోజుల పాటు జరిగే ఉచిత దత్తక్రియ యోగా శిక్షణా తరగతులు బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. గణపతి సచ్చిదానంద స్వామి వద్ద దత్తక్రియ యోగాలో శిక్షణ పొందిన వేణుగోపాల్ లునానిచే క్రియా యోగా శిక్షణ గురించి వివరించారు. నాలుగు రోజులు పాటు జరిగే దత్తక్రియ యోగా శిక్షణ మనిషి జీవన విధానానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు బివి.సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE, WEST GODAVARI DISTRICT AT ELURU
E.P. No.94 of 2012 in O.S. No. 28 of 2009

Between:
Jhansi Krishna Holdings, Represented by It's Managing Partner Aluri Krishna Prasad ... Decree Holder
AND
1)Gutta Ravi Babu 2)Gutta Bharathi 3)Koneru Ramesh Kumar 4)Koneru Annapurana 5)Shrirarn Chits Limited, rep. by It's Branch Manager, Governorpet, Vijayawada. ...Judgment Debtors

పై నెంబరు దావా డిక్రీ దావా క్రింద 4వ జెడిఆర్ స్వాధీన హక్కుభుక్తములలో యుండి ఫైలు జప్తు కాబడిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీ కోర్టువారు బహిరంగ వేలం వేయుటకు ది. 14-03-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. కనుక వేలంలో పాల్గొనదలచిన వారు సదరు తేదీ ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట హాజరై వేలంలో పాల్గొనవచ్చును.

వేలం కావలసిన స్థిరాస్థి షెడ్యూలు

Item No.1:
An extent of 97.2/9 Square Yards site in which 3/8 th joint right with RCC Building with electrical and wooden fittings, D.No.4-15-1/1, Municipal 'Af Ward, TSN Nos.74 and 75, Block No.4, Assessment No.3722, Uka Sandu, Agraharam, Eluru Municipal Corporation Area, Eluru, West Godavari District, Eluru Sub-Registry bounded by:
East : Site belongs to Municipal Corporation - 45'9"
South : Site belongs to Municipal Corporation -17'0"
West : Site belongs to Municipal Corporation -44'0"
North : Item No.2 property -22'0"

Item No.2 :
An extent of 1002 7/9 Square Yards site in which 3/8th joint right with RCC Building with electrical and wooden littings, D.No.4-15-1/1, Municipal 'A' Ward, TSN Nos.74 and 751 Block No.4, Assessment No.3722, Uka Sandu, Agrahatam, Eluru Municipal Corporation Area, Eluru, West Godavari District, Eluru Sub-Registry bounded by:
East : Property belongs to Guduru Siva - Subrahmanyam and others ... 7 7'4"
South : Some extent site belongs to Municipals Corporation & Some extent Item No.1 ... 101'6"
West : House site belongs to Kora Sikhs Krishnumurthy and others ... 108'.8"
North : Municipal Lane ...93'.9"

Item No.3 :
An extent of 97.2/9 Square Yards site in which 1/16th joint right with RCC Building with electrical and wooden fittings, D•No.4-15-1/1, Municipal 'A' Ward, TSN Nos.74 and 75, Block No.4, Assessment No.3722, Uka Sandu, Agraharam, Eluru Municipal Corporation Area, Eluru, West Godavari District, Eluru Sub-Registry bounded by:
East : Site belongs to Municipal Corporation ...45/9"
South : Site belongs to Municipal Corporation ...17'0"
West : Site belongs to Municipal Corporation ...44'0"
North : Item No.4 property ...22'0"

Item No.4 :
An extent of 1002 7/9 Square Yards site in which 1/16 th joint right with RCC Building with electrical and wooden fittings, D.No.4-15-1/1, Municipal 'A' Ward, TSN Nos.74 and 75, Block No.4, Assessment No.3722, Uka Sandu, Agraharam, Eluru Municipal Corporation Area, Eluru, West Godavari District, Eluru Sub-Registry bounded by:
East : Property belongs to Guduru Siva Subrahmanyam and others ...77'4"
South Some extent site belongs to Municipal-Corporation & Some extent Item No.3 ...101'6"
West House site belongs to Kora Sikha -- Krishnamurthy and others ...108'.8"
North Municipal Lane ... 93'.9"

- Item Nos. 1 to 4 abutting each other and consisting as one plot and total extent of Item Nos. 1 to 4 is 481 Square Yards or 402.263 Square Meters Site in which RCC Building with electrical and wooden fittings.
- D.Hr. values the schedule property is Rs.25,00,000/- (Rupees twenty five lakhs only)
- Amen Value Rs.1,21,34,000/- One Crore twenty one lakhs thirty four thousand only)
- Market Value Rs.2,88,60,000/- (Two Crores Eighty eight Lakhs Sixty Thousand only)

Auction Date : 14-03-2024
The above sale is subject to Mortgage Decree Debt:
Eluru,
Dt : 18-02-2024

T.Anjaneyulu,
K.Anjaneyulu,
Advocates for Decree Holder
Near Karim Hotel, NRP road,
Gandhi Nagar, Vijayawada - 520003.
Ph : 9346787250.